సాక్షి సిద్దిపేట

ఆదివారం । 29 । అక్టోబర్ । 2023



'సోషల్' వార్

ఎమ్మెల్యే అభ్యర్థులు ఓటర్లను ఆకర్షించడానికి సామాజిక మాధ్యమాలను ప్రచార అస్త్రంగా వినియోగించుకుంటున్నారు.

వివరాలు 10లో ▸



ఇక్కడ గెలిస్తే..

గజ్వేల్ నియోజకవర్గంలో గెలిచే పార్టీయే రాష్ట్రంలో అధికారంలోకి రావడం ఆనవాయితీగా మారింది.

వివరాలు 10లో ▸



స్వేచ్ఛగా ఓటెయ్యండి

ప్రజలు ఎవరికి భయపడకుండా స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని ఏసీపీ సురేందర్‌రెడ్డి పేర్కొన్నారు.

వివరాలు 11లో ▸

న్యూస్‌రీల్

ఈసారి కేసీఆర్‌ది హ్యాట్రిక్ విజయం



మాట్లాడుతున్న కొత్త ప్రభాకర్‌రెడ్డి

రాయపోలు(దుబ్బాక): తెలంగాణను దేశంలోనే అగ్రస్థానంలో నిలిపిన కేసీఆర్ ముచ్చటగా మూడోసారి సీఎం కుర్చీని అధిరోహిస్తారని దుబ్బాక బీఆర్‌ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శనివారం రాయపోలు మండలంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని మంతూరు, అనాజీపూర్, చౌదరి పాలెం, లింగారెడ్డిపల్లి, కొత్తపల్లి గ్రామాల్లో పర్యటించా రు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తెలంగాణలో తొమ్మిదేళ్లలో ఎనలేని ప్రగతి సాధించిందామన్నారు. తనను దుబ్బాకలో గెలిపిస్తే అందరికీ అందుబాటులో ఉండి సేవ చేసుకుంటా నని హామీ ఇచ్చారు. ఆయన వెంట ఎంపీపీ అనిత, జెడ్పీటీసీ యాదగిరి, నాయకులు మోహన్‌రెడ్డి, వెంకటేశ్వర శర్మ, పలు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

ఫోన్లపై నియంత్రణ అవసరం



మాట్లాడుతున్న జడ్జి స్వాతిరెడ్డి

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): మొబైల్ ఫోన్ల వాడకం ద్వారా విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వాటి వినియోగించడంపై నియంత్రణ అవసరమని జిల్లా సీనియర్ సివిల్ జడ్జి స్వాతిరెడ్డి అన్నారు. శనివారం సిద్దిపేట జిల్లా కేంద్రంలోని ఇందిరానగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో లీగల్ సెల్ అవగాహన నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీనియర్ సివిల్ జడ్జి స్వాతిరెడ్డి మాట్లాడుతూ.. చిన్నారులపై మొబైల్ ఫోన్ల ప్రభావం అధికంగా ఉందన్నారు. చదువును నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. సిద్దిపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, శ్రీకర్ రెడ్డి, డీఎంహెచ్‌ఓ శ్రీనివాస్, ఎస్ఐ నర్సింహారావు, ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్‌రెడ్డి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ సభ్యులు మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాస్‌పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ జిల్లా యూత్ అధ్యక్షుడిగా నాగరాజు



నాగరాజును అభినందిస్తున్న వంటేరు

వర్గల్(గజ్వేల్): బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా యూత్ విభాగం అధ్యక్షుడిగా వర్గల్‌కు చెందిన పార్టీ సీనియర్ నాయకుడు దేవగణిక నాగరాజు నియమితులయ్యారు. శనివారం మంత్రి హరీశ్‌రావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు కొత్త ప్రభాకర్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర అటవీఅభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ప్రకటించారు. నాగరాజుకు శాలువా కప్పి అభినందించారు. తనకు జిల్లా బాధ్యత అప్పగించిన మంత్రికి, ఎంపీకి, వంటేరుకు అధ్యక్షుడు నాగరాజు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

30 నుంచి రాష్ట్ర స్థాయి యోగా పోటీలు

సిద్దిపేటజోన్: స్థానిక టీటీసీ భవన్‌లో ఈనెల 30 నుంచి నవంబర్ 1 వరకు రాష్ట్ర స్థాయి యోగా పోటీలు నిర్వహించనున్నట్లు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, ఆర్గనైజింగ్ కార్యదర్శులు శ్రీనివాస్ రెడ్డి, రామేశ్వర్ రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి పది జిల్లాలకు చెందిన అండర్ 14, 17 విభాగాల్లో బాలబాలికలు పాల్గొంటారని, ప్రతిభ చూపిన వారిని జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

మల్లన్న ఆలయంలో ప్లంబింగ్ వస్తువుల చోరీ

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయంలో తోటబావి వద్ద ప్లంబింగ్ వస్తువులను భద్రపరిచే స్టోర్ రూం తాళం పగులగొట్టి గుర్తు తెలియని వ్యక్తులు రూ.70 వేలు విలువ గల వస్తువులు దొంగిలించారు. ప్లంబింగ్ ఇన్‌చార్జి సార్ల విజయ్‌కుమార్ ఆలయ ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. ఆలయ ఏఈఓ శనివారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ఎస్ఐ నాగరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేసి విచారిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.



సంగారెడ్డి జిల్లా హత్నూర మండలంలోని ఓ ఫాంహౌస్‌లో సమావేశమైన కాంగ్రెస్ అసమ్మతి నాయకులు

భగ్గుమన్న అసమ్మతి

నర్సాపూర్, హుస్నాబాద్‌లో రగులుతున్న కాంగ్రెస్ అసంతృప్తులు

- అనుచరులతో సమావేశమైన గాలి అనిల్‌కుమార్
- నర్సాపూర్ టికెట్‌పై పునరాలోచించాలని డిమాండ్
- లేకుంటే స్వతంత్రంగా బరిలో ఉంటామని హెచ్చరిక
- హుస్నాబాద్‌లోనూ అలిగిన అల్గిరెడ్డి

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి: కాంగ్రెస్ పార్టీ రెండో జాబితా అభ్యర్థుల ప్రకటనతో అసమ్మతి సెగలు భగ్గుమన్నాయి. నర్సాపూర్ టికెట్‌ను ఆవుల రాజిరెడ్డికి కేటాయించడాన్ని నిరసిస్తూ అసంతృప్త నేతలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ మేరకు హత్నూర మండలంలోని ఓ ఫాంహౌస్‌లో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ టికెట్ కోసం రాజిరెడ్డితోపాటు పీసీసీ ఉపాధ్యక్షుడు గాలి అనిల్‌కుమార్, ముఖ్యనాయకులు రెడ్డిపల్లి ఆంజనేయులు, సోమన్నగారి రవీందర్‌రెడ్డి తదితరులు ఆశించారు. అనూహ్యంగా ఆవుల రాజిరెడ్డికి టికెట్ దక్కింది. దీంతో మిగిలిన ముగ్గురు అసంతృప్త నేతలు ప్రత్యేకంగా సమావేశమై వారి భవిష్యత్ కార్యాచరణను ప్రకటించారు. అధినాయకత్వం తక్షణం పునరాలోచించి అభ్యర్థిని మార్చాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో తమ ముగ్గురిలో ఒకరు స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగుతామని హెచ్చరించారు. ఈ అసమ్మతి నేతల సమావేశానికి పలు మండలాల అధ్యక్షులు కూడా పాల్గొన్నారు.

హుస్నాబాద్‌లోనూ అసంతృప్త సెగలు

హుస్నాబాద్ కాంగ్రెస్‌లోనూ అసంతృప్త సెగలు బయటపడ్డాయి. టికెట్‌ను మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్‌కు కేటాయిస్తూ అధినాయకత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో ఈ టికెట్ ఆశించిన మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తన నివాసంలో ముఖ్య అనుచరులతో సమావేశం నిర్వహించారు. పొన్నం ప్రభాకర్ శనివారం ప్రవీణ్‌రెడ్డిని కలిసి తనకు మద్దతివ్వాలని కోరగా.. తన అనుచరులతో చర్చించాక నిర్ణయం ప్రకటిస్తామని ప్రవీణ్‌రెడ్డి తేల్చి చెప్పినట్లు కాంగ్రెస్ వర్గాలు చెబుతున్నాయి. రెండో జాబితాలో ఉమ్మడి జిల్లాలో నాలుగు స్థానాలకు టిక్కెట్లు ఖరారు చేసిన విషయం విదితమే. ఈ అసమ్మతి నేతలు పట్టువీడుతారా? లేదా ? అనేది కొద్ది రోజుల్లోనే తేలనుంది.

దామోదర వద్దకు పంచాయితీ


నర్సాపూర్ టికెట్ పంచాయితీ మాజీ ఉపముఖ్యమంత్రి దామోదర రాజనర్సింహ వద్దకు చేరింది. హత్నూర ఫాంహౌస్‌లో సమావేశమైన అసమ్మతి నేతలు శనివారం దామోదర్‌ను కలిసినట్లు తెలిసింది.

రాజిరెడ్డి బీఆర్‌ఎస్ కోవర్టు

కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రకటించిన ఆవుల రాజిరెడ్డిపై అసమ్మతి నేతలు తీవ్రంగా మండిపడ్డారు. ఇక్కడ బీఆర్‌ఎస్ అభ్యర్థి సునీతారెడ్డికి కోవర్టు అని వారు ఆరోపించారు. సునీతాతో రాజిరెడ్డి కుమ్మక్కయ్యారని ఆరోపించారు.

ఇంకెప్పుడు?

- సిద్దిపేట, హుస్నాబాద్ బీజేపీ అభ్యర్థులెవరో?
- ఇంకా ప్రకటించని పార్టీ అధిష్టానం
- కాంగ్రెస్, బీఆర్‌ఎస్ జోరుగా ప్రచారం



సాక్షి, సిద్దిపేట: సాధారణ ఎన్నికలకు అన్ని నియోజకవర్గాల్లో ప్రధాన పార్టీలు బీఆర్‌ఎస్, కాంగ్రెస్ తమ అభ్యర్థులను ప్రకటించాయి. కానీ బీజేపీ మాత్రం తమ పార్టీ అభ్యర్థులను ప్రకటించలేదు. ఆగస్టు 21న ఒకే జాబితాలో బీఆర్‌ఎస్ తమ అభ్యర్థులను ప్రకటించి, బీఫాంలను అందజేశారు. దీంతో అభ్యర్థులు ప్రచారంలో దూసుకుపోతున్నారు. 15న హుస్నాబాద్, 17న సిద్దిపేటలో ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్ సైతం పాల్గొన్నారు. అలాగే, కాంగ్రెస్ ఈ నెల 15న, 27వ తేదీల్లో రెండు జాబితాల్లో వారి అభ్యర్థులను ప్రకటించగా, వారు సైతం ప్రచారం ముమ్మరం చేశారు.

సిద్దిపేట, హుస్నాబాద్ నుంచి ఎవరో..

బీజేపీ ఇప్పటి వరకు దుబ్బాక అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్యే రఘునందన్‌రావు, గజ్వేల్ నుంచి హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటెల రాజేందర్, జనగామ అభ్యర్థిగా ధర్మంత్ రెడ్డిలను ప్రకటించారు. ఇంకా హుస్నాబాద్, సిద్దిపేట అభ్యర్థులు ఎవరో ప్రకటించలేదు. హుస్నాబాద్ నుంచి బరిలో దిగేందుకు బొమ్మ శ్రీరాంచక్రవర్తి, సురేందర్ రెడ్డిలతోపాటు ఇటీవల పార్టీలో చేరిన సామాజిక సేవకురాలు కర్ణకంటి మంజుల టికెట్‌ను ఆశిస్తున్నారు. బండి సంజయ్ అనుచరుడుగా శ్రీరాం చక్రవర్తి, ఈటెల రాజేందర్ అనుచరుడిగా సురేందర్‌రెడ్డి కొనసాగుతున్నారు. ఈ ఇద్దరు నేతలు ఎవరికి వారు ఢిల్లీ స్థాయిలో టికెట్ కోసం పైరవీలు చేసుకుంటున్నారు. సిద్దిపేట టికెట్ ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు దూది శ్రీకాంత్ రెడ్డి ఆశిస్తున్నారు. కొన్నేళ్లుగా పార్టీలో ఉంటూ వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్న తనకే అవకాశం ఇవ్వాలని కేంద్ర నాయకత్వాన్ని కోరుతున్నాడు.అధిష్ఠానం ఎవరిని ప్రకటిస్తుందని కార్యకర్తలు, నాయకులు ఎదురుచూస్తున్నారు. బీఎస్పీ, ఆప్, ఏఐఎఫ్‌బీ పార్టీలు తమ ఎమ్మెల్యే అభ్యర్థులను ప్రకటించకపోవడంతో ఎవరు బరిలో ఉంటారో అని జిల్లావ్యాప్తంగా జోరుగా చర్చ సాగుతోంది.

అవినీతికి వ్యతిరేకంగా మాట్లాడుదాం



అవగాహన కల్పిస్తున్న నాగేందర్, తదితరులు

సిద్దిపేటజోన్: ప్రతి ఒక్కరూ అవినీతికి వ్యతిరేకంగా మాట్లాడాలని యువజన, క్రీడల శాఖ జిల్లా అధికారి నాగేందర్ అన్నారు. యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో అవినీతి వ్యతిరేక వారోత్సవాల్లో భాగంగా స్థానిక స్టేడియంలో ప్లకార్డులతో బ్యాంక్ అధికారులు, సిబ్బందికి అవగాహన కల్పించారు. అనంతరం బ్యాంక్ ఉద్యోగుల ఫ్రెండ్లీ క్రికెట్ మ్యాచ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అవినీతికి నో చెప్పి, జాతీయ సమాఖ్యకు కట్టుబడాలని సూచించారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంకు సిద్దిపేట రీజినల్ హెడ్ వికాస్, డిప్యూటీ అధికారులు రాఘవ, సంజయ్‌తో పాటు సిద్దిపేట, సంగారెడ్డి, కామారెడ్డి, మెదక్ జిల్లాల బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

● 'ద్వార' బంధనం





ఆలయాన్ని మూసివేస్తున్న ఆలయ అర్చకులు

← మూసివేసిన నాచగిరి ఆలయ ద్వారం

చంద్రగ్రహణం సందర్భంగా శనివారం మధ్యాహ్నం జిల్లాలో సుప్రసిద్ధమైన వర్గల్ విద్యాసరస్వతి, నాచగిరి శ్రీలక్ష్మీ నర్సింహస్వామి ఆలయాలకు ద్వార బంధనం చేశారు. కొమురవెల్లి మల్లన్న ఆలయంతోపాటు అనుబంధ ఆలయాలను ఆలయ అర్చకులు మూసివేశారు. తిరిగి ఆదివారం ఉదయం సంప్రోక్షణ, అభిషేకం అనంతరం యథావిధిగా భక్తులకు అనుమతి కల్పిస్తారు.

– కొమురవెల్లి(సిద్దిపేట)/వర్గల్(గజ్వేల్)

ఓటర్ అసిస్టెంట్ బూత్ ఏర్పాటు

- కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్
- ముగిసిన డిస్ట్రిక్ట్, నియోజకవర్గస్థాయి ట్రైనర్స్ శిక్షణ



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్

సిద్దిపేటరూరల్: ఎన్నికల్లో ప్రజలు వారి ఓటు హక్కును సంపూర్ణంగా వినియోగించుకునేందుకు పోలింగ్ స్టేషన్ ఆవరణలో ఓటర్ అసిస్టెంట్ బూత్‌ను ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్ తెలిపారు. శనివారం అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో జిల్లా స్థాయి మాస్టర్ ట్రైనర్స్, అసెంబ్లీ నియోజకవర్గం మాస్టర్ ట్రైనర్స్‌కి చివరి రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవీఎం మిషన్లలో బ్యాలెట్ యూనిట్, కంట్రోల్ యూనిట్, వీవీ ప్యాడ్ మిషన్ల అనుసంధానం ప్రక్రియ, వీవీ ప్యాడ్ మిషన్‌లో పేపర్ అమర్చే విధానం, కంట్రోల్ యూనిట్ ఆపరేట్ చేసే దశలను మాస్టర్ ట్రైనర్స్ అధికారులు క్షుణ్ణంగా వివరించారు. మాస్టర్ ట్రైనర్, సెక్టార్ అధికారులకు కేటాయించిన పోలింగ్ స్టేషన్ల గూర్చి పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఏఆర్వోలు, సెక్టార్ అధికారులు మండలంలోని గ్రామాల పంచాయతీ సెక్రటరీలతో సమావేశాలు నిర్వహించి పోలింగ్ స్టేషన్లలో సదుపాయాల గురించి ఆరా తీయాలన్నారు. పోలీస్ స్టేషన్ల చుట్టూ 100 మీటర్ల దూరంలో ప్రచారాలు, పోస్టర్లు, హోర్డింగ్ లేకుండా చూసుకోవాలన్నారు. సమావేశంలో సిద్దిపేట, గజ్వేల్ ఆర్వోలు రమేశ్‌బాబు, బన్సీలాల్, డిస్టిక్ లెవెల్ మాస్టర్ ట్రైనర్స్ అధికారి అయోధ్య రెడ్డి, సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన బోధన

జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి



మాట్లాడుతున్న విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి

కొండపాక(గజ్వేల్): ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్యాబోధనలు అందుతాయని జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కొండపాక మండలంలోని సిర్సనగండ్ల హైస్కూల్, కుకునూరుపల్లిలోని హైస్కూల్‌లో శనివారం పేరెంట్స్ కమిటీ సమావేశాలను నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధనలు అందేలా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించేలా మన ఊరు మన బడి పథకాన్ని చేపట్టిందన్నారు. పీఏసీఎస్ వైస్ చైర్మన్ అమరేందర్ మాట్లాడుతూ.. విద్యార్థులు ఆరోగ్యంగా ఉండేలా చూసేందుకు సన్నబియ్యంతోపాటు మధ్యాహ్న భోజనం, అల్పాహార విందును ఏర్పాటు చేసిందన్నారు. కుకునూరుపల్లి హైస్కూల్లో సైన్సు ల్యాబ్, గణితం ప్రత్యేక గది, లైబ్రరీ గది ఏర్పాటు కోసం సర్పంచ్ జయంతి, ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ మల్లం ఐలయ్య, పీఏసీఎస్ వైస్ చైర్మన్ పిస్క అమరేందర్ సాయం చేయడానికి ముందుకు రావడంపై హెచ్ఎం సత్తయ్య కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీనివాస్ రెడ్డి, పీఎస్ఆర్ ట్రస్టు నిర్వాహకులు నరేందర్, తల్లిదండ్రులు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భారీ మెజార్టీతో గెలిపించుకుందాం

మంత్రి హరీశ్‌రావు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న మంత్రి హరీశ్‌రావు

వర్గల్(గజ్వేల్): సీఎం కేసీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకొని గజ్వేల్ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసుకుందామని మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని తన నివాసం వద్ద ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన వారిలో వర్గల్ పీఏసీఎస్ మాజీ చైర్మన్, అనంతగిరిపల్లి మాజీ సర్పంచ్, బీజేపీ నాయకుడు కాయిత ఎర్ర మల్లయ్య, బీజేపీ నాయకులు తుమ్మల వెంకటేష్, కర్రె కిష్టయ్య, కాంగ్రెస్ నాయకులు గువ్వ పోచయ్య, సింగాయపల్లికి చెందిన సురేందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు నాగరాజు, ఎంపీపీ లతారమేశ్‌గౌడ్, వైస్‌ఎంపీపీ బాల్‌రెడ్డి, నాయకులు కనకరాజు పాల్గొన్నారు.

రాష్ట్రంలో బీజేపీదే విజయం

ఎమ్మెల్యే రఘునందన్‌రావు

రాయపోలు(దుబ్బాక): వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీదే అధికారం అని దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు అన్నారు. రాయపోలు మండలంలోని వడ్డేపల్లి, దొడ్లపల్లి గ్రామాలకు చెందిన పలువురు బీఆర్‌ఎస్,కాంగ్రెస్ నుంచి బీజేపీలో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో నాయకులు రాజాగౌడ్ పాల్గొన్నారు.



కండువా కప్పుతున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు

తొగుట(దుబ్బాక): రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే బీసీ వ్యక్తిని సీఎం చేస్తామని బీజేపీ దుబ్బాక అభ్యర్థి రఘునందన్‌రావు స్పష్టంచేశారు. మండలంలోని లింగాపూర్, బంజేరుపల్లి, జప్తి లింగారెడ్డిపల్లి గ్రామాల్లో శనివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎంపీటీసీల ఫోరం మండల అధ్యక్షుడు, వెంకట్రావుపేట ఎంపీటీసీ కకంనాల నర్సింలు, వార్డు సభ్యులు బీజేపీలో చేరారు. దుబ్బాక పట్టణంలోని ఎమ్మెల్యే స్వగృహంలో రఘునందన్‌రావు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వెంకట్రావుపేట, ఎల్ బంజేరుపల్లి వార్డు సభ్యులు బీజేపీలో చేరారు. కార్యక్రమంలో సర్పంచ్ నర్సింలు యాదవ్, ఉప సర్పంచ్‌లు శ్రీకాంత్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి విభీషణ్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు చంద్రం, నాయకులు స్వామిరెడ్డి, నర్సింహారెడ్డి, నరేందర్, కల్యాణ్‌దాస్ పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌తో మహాయుద్ధం | కాంగ్రెస్‌కు అంత సులువుకాదు

- ఏఐసీసీ కార్యదర్శి క్రిష్టోఫర్ తిలక్
- ప్రణాళికతో ముందుకెళ్లాలి
- 70 సీట్లు వస్తాయని సర్వేలు చెబుతున్నాయి



సమావేశంలో మాట్లాడుతున్న క్రిష్టోఫర్ తిలక్, చిత్రంలో పొన్నం ప్రభాకర్ తదితరులు

హుస్నాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌తో మహా యుద్ధం చేయడం కాంగ్రెస్‌కు అంత సులువు కాదని, మంచి ప్రణాళికతో ముందుకెళ్లాలని ఏఐసీసీ కార్యదర్శి, కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జి క్రిష్టోఫర్ తిలక్ అన్నారు. హుస్నాబాద్ పట్టణ శివారులోని శుభం గార్డెన్‌లో శనివారం హుస్నాబాద్ టౌన్, హుస్నాబాద్, అక్కన్నపేట మండలాలకు చెందిన కాంగ్రెస్ బూత్ లెవల్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన క్రిష్టోఫర్ తిలక్ కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. మంచి సంకల్పం, ప్రణాళికతో ప్రతీ కార్యకర్త 30 రోజులు ప్రతీ ఇంటిని మూడు సార్లు సందర్శించి కాంగ్రెస్ గ్యారెంటీ పథకాలను వివరించాలని సూచించారు. సర్వేల రిపోర్టులు సైతం తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి 70 స్థానాలు వస్తాయని తేల్చి చెప్పాయన్నారు.

ప్రవీణ్ రెడ్డికి సముచిత స్థానం కల్పిస్తాం..

వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని, ప్రవీణ్ రెడ్డికి ఎమ్మెల్సీ లేదా సముచిత స్థానం కల్పించేందుకు అధిష్టానంతో మాట్లాడుతానని హుస్నాబాద్ కాంగ్రెస్ అభ్యర్థి, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ అన్నారు. కష్టకాలంలో కార్యకర్తలు అండగా నిలిచి పార్టీని గెలిపించుకోవాలని సూచించారు. గౌరవెల్లి ప్రాజెక్టును పూర్తి చేశామని ఎమ్మెల్యే సతీష్‌కుమార్ చెబుతుంటే, ఇటీవల హుస్నాబాద్‌కు వచ్చిన సీఎం కేసీఆర్ ప్రాజెక్టును ఆరు నెలల్లో పూర్తి చేస్తామని చెప్పడం ఆశ్చర్యంగా ఉందన్నారు. ఎవరి మాటల్లో నిజమేంటో ప్రజలు గ్రహించాలన్నారు. సమావేశంలో ఏఐసీసీ సభ్యుడు, అసెంబ్లీ పరిశీలకుడు గోపినాథ్ పళనియప్పన్, టీపీసీసీ సభ్యుడు కేడం లింగమూర్తి, డీసీసీ కార్యదర్శులు చిత్తారి రవీందర్, ఎండీ హస్సేన్, హుస్నాబాద్, అక్కన్నపేట పార్టీ మండల అధ్యక్షులు బంక చందు, జంగపల్లి ఐలయ్య, కౌన్సిలర్లు చిత్తారి పద్మ, సరోజన, వల్లపు రాజు, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి బోనగిరి రజిత, నాయకులు పాల్గొన్నారు.

సీఎం అభ్యర్థి ఎవరో చెప్పాలి?

- కాంగ్రెస్, బీజేపీ గెలిస్తే నిర్ణయాధికారం ఢిల్లీ నాయకుల చేతుల్లో
- హుజూరాబాద్ ఎన్నికల ఇన్‌చార్జి పెద్దిరెడ్డి
- గౌరవెల్లి ప్రాజెక్టుకు అడ్డుకుంది ప్రతి పక్షాలే
- ఎమ్మెల్యే సతీష్‌కుమార్



అభివాదం చేస్తున్న పెద్దిరెడ్డి, ఎమ్మెల్యే సతీష్‌కుమార్

హుస్నాబాద్‌రూరల్: రాష్ట్రంలో బీఆర్‌ఎస్ గెలిస్తే కేసీఆర్ సీఎం అవుతారని, బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు గెలుస్తే సీఎం ఎవరు అవుతారో తెలువదని, నిర్ణయాధికారం ఢిల్లీ నాయకుల చేతుల్లో ఉంటుందని మాజీ మంత్రి, హుస్నాబాద్, హుజురాబాద్ ఎన్నికల ఇన్‌చార్జి ఇనుగాల పెద్దిరెడ్డి విమర్శించారు. శనివారం బీఆర్‌ఎస్ అభ్యర్థి ఎమ్మెల్యే ఒడితల సతీష్‌కుమార్‌తో కలిసి తోటపల్లి,గాంధీనగర్, మాలపల్లి, మడద, రాములపల్లి, పొట్లపల్లి, పందిల్ల, కూచనపెల్లి, బంజేరుపల్లి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దిరెడ్డి మాట్లాడుతూ.. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణ రాష్ట్రంను అభివృద్ధి చేసి, దేశంలోనే నంబర్ వన్‌లో కేసీఆర్ నిలబెట్టారని అన్నారు. హుస్నాబాద్ ఎమ్మెల్యేగా ఒడితల సతీష్ కుమార్‌ను గెలిపిస్తే అక్కడ కేసీఆర్ సీఎం అవుతారని, సంక్షేమ పథకాలు మరిన్ని అమలు అవుతాయన్నారు. ఎమ్మెల్యే సతీష్‌కుమార్ మాట్లాడుతూ.. మెట్ట ప్రాంత రైతులకు సాగు నీరు అందించాలని గౌరవెల్లి ప్రాజెక్టు పనులను పూర్తి చేసి గోదావరి జలాలతో నింపామన్నారు. గ్రామాలకు వచ్చే కాంగ్రెస్, బీజేపీ, సీపీఐ నాయకులు ప్రాజెక్టు పనులు ఎందుకు అడ్డుకున్నారో ప్రశ్నించి నిలదీయాలని ఓటర్లకు పిలుపునిచ్చారు. గాంధీనగర్‌లో బీఎస్పీ, బీజేపీ కార్యకర్తలు మా ఊరుకు సంక్షేమ పథకాలు అందడం లేదని ప్లకార్డులతో నిరసన తెలిపారు. ఎంపీపీ లకావత్ మానస, మార్కెట్ చైర్‌పర్సన్ ఎడబోయిన రజనీ తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీపీ వెంకన్న, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, సర్పంచ్‌లు లతా, భారతీ, రాజేశ్వరి, మధు, దేవసాని సుశీల, తోడేటి రమేశ్, రాంచంద్రారెడ్డి, బాలస్వామి పాల్గొన్నారు.

క్లుప్తంగా

బీజేపీ, బీఆర్ఎస్‌లను ఓడించండి



మాట్లాడుతున్న మల్లారెడ్డి

సిద్దిపేటఅర్బన్: శాసనసభ ఎన్నికల్లో మతోన్మాద బీజేపీ, అవినీతిమయమైన బీఆర్ఎస్ పార్టీలను ఓడించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. దేశంలో బీజేపీ కులాలు, మతాల పేరుతో ప్రజల మధ్య చిచ్చు పెడుతుందని ఆరోపించారు. ప్రభుత్వ రంగాన్ని, ప్రకృతి వనరులను ధ్వంసం చేసి భవిష్యత్తును నాశనం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలో ఏ ఒక్క పథకం పూర్తి స్థాయిలో అమలు కాలేదని విమర్శించారు. రూ.లక్ష కోట్లతో కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతి, నిర్మాణ లోపాలు ఉన్నాయని, వీటిపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో శశిధర్, రవికుమార్, నవీన, ప్రశాంత్, శిరీష, బాలు పాల్గొన్నారు.

అభివృద్ధిని గుర్తించండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

మనూరు(నారాయణఖేడ్): ప్రజలు అభివృద్ధిని చూసి ఓటెయ్యాలని బీఆర్ఎస్ అభ్యర్థి భూపాల్‌రెడ్డి అన్నారు. శనివారం నాగల్‌గిద్ద మండలంలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం ఖుబా తండాలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాకే తాగునీటి సమస్య తీరిందని, తండాలకు బీటీ రోడ్డు సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పండరి యాదవ్, రఫీ, కిషన్‌నాయక్, కిషన్, విజయ్ పాల్గొన్నారు.

తెలంగాణ పథకాలు దేశానికి ఆదర్శం

ఎఫ్‌డీసీ ఛైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్: ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలనే ఎన్నికల్లో ప్రచారాస్త్రాలుగా మలుచుకుంటామని ఎఫ్‌డీసీ ఛైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని ఓ గార్డెన్స్‌లో కేబుల్ ఆపరేటర్ల సంఘం ఆధ్వర్యంలో కేసీఆర్‌కు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు ప్రతాప్‌రెడ్డికి ఏకగ్రీవ తీర్మాన పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని చెప్పారు. గజ్వేల్‌లో మూడోసారి పోటీ చేస్తున్న కేసీఆర్‌ను లక్ష ఓట్ల మెజారిటీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కాగా, గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని రియల్ ఎస్టేట్ వ్యాపారుల సంఘం కూడా మద్దతు తెలుపుతున్నట్లు ఏకగ్రీవ తీర్మానాన్ని అందించారు.



తీర్మాన పత్రాన్ని అందిస్తున్న కేబుల్ ఆపరేటర్ల సంఘం నాయకులు

పార్టీ యువజన అధ్యక్షుడిగా నాగరాజు

బీఆర్ఎస్ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడిగా వర్గల్‌కు చెందిన నాగరాజును నియమించినట్లు ప్రతాప్‌రెడ్డి తెలిపారు. మంత్రి హరీశ్‌రావు, పార్టీ జిల్లా అధ్యక్షుడు కొత్త ప్రభాకర్‌రెడ్డి నియామకాన్ని ఖరారు చేశారని తెలిపారు.

కార్యకర్తలు కష్టపడితే గెలుపు తథ్యం



మాట్లాడుతున్న చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

కాంగ్రెస్ అభ్యర్థి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

దౌల్తాబాద్(దుబ్బాక): ప్రతీ కాంగ్రెస్ కార్యకర్త నేనే దుబ్బాక అభ్యర్థి అనుకుని పని చేయాలని ఆ పార్టీ అభ్యర్థి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్లో దౌల్తాబాద్, రాయపోల్, చేగుంట, నర్సింగ్ మండలాల పార్టీ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి హాజరై ఆయన మాట్లాడారు. అంతకు ముందు దౌల్తాబాద్‌లోని శ్రీవేంకటేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దుబ్బాక నియోజకవర్గంలో మాజీ మంత్రి, దివంగత నేత చెరుకు ముత్యంరెడ్డి చేసిన పనులే ఇప్పటికీ కనిపిస్తున్నాయన్నారు. తనకు టికెట్ రాగానే బీఆర్ఎస్, బీజేపీ నాయకులకు చెమటలు పడుతున్నాయని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ కార్యకర్తలందరూ 30 రోజులు తన కోసం పనిచేయాలని, గెలిచిన తర్వాత ప్రజల కోసం 60 నెలలు పని చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం చేగుంట, నర్సింగ్ మండలాలకు చెందిన 100 మంది చెరుకు శ్రీనివాస్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో పడాల రాములు, సుధాకర్, నవీన్, శ్రీనివాస్‌గౌడ్, బాల్‌నర్స్‌గౌడ్, బండారు లాలు, దశరథరెడ్డి, ఆది వేణుగోపాల్, సంపత్ రెడ్డి, మల్లారెడ్డి, నర్సింహులు పాల్గొన్నారు.

సోషల్ వార్

సామాజిక మాధ్యమాల్లో ఎన్నికల ప్రచారం

- విమర్శ, ప్రతివిమర్శ అన్నీ అందులోనే..
- కోఆర్డినేటర్లను నియమించుకుంటున్న ఎమ్మెల్యే అభ్యర్థులు
- మైనంపల్లి వర్సెస్ పద్మాదేవేందర్‌రెడ్డి అనుచరుల హల్‌చల్
- ఒకరిపై మరొకరు ఎస్పీకి ఫిర్యాదులు



మెదక్: ఒకప్పుడు ఎన్నికలు వచ్చాయంటే ఆ హంగామే వేరుగా ఉండేది. బరిలో నిలిచే అభ్యర్థులు ప్రచారంతో హోరెత్తించేవారు. పట్టణాలు, గ్రామాల్లో సభలు సమావేశాలు, పాదయాత్రలు నిర్వహిస్తూ బిజీగా గడిపేవారు. ఇంటింటికీ తిరుగుతూ ఓటు వేయాలని అభ్యర్థించేవారు. కానీ ఇప్పుడు ట్రెండ్ మారింది. ఎన్నికల ప్రచారాన్ని ఊరి వీధుల్లో కాకుండా సోషల్ మీడియాలో చేస్తున్నారు. ఎమ్మెల్యే అభ్యర్థులు ఓటర్లను ఆకర్షించడానికి సామాజిక మాధ్యమాలను ప్రచార అస్త్రంగా వినియోగించుకుంటున్నారు. ప్రత్యర్థిపై విమర్శలు చేయాలన్నా.. సొంత డబ్బా కొట్టుకోవాలన్నా సోషల్ మీడియానే ఎంచుకుంటున్నారు. వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్, ఎక్స్(ఒకప్పుడు ట్విట్టర్), టెలీగ్రామ్ ఇలాంటి సోషల్ మీడియా యాప్‌లలో ప్రచారం, ప్రసంగాల వీడియోలు, ఫొటోలు, కంటెంట్‌ను పోస్ట్ చేస్తున్నారు.

అన్ని పార్టీలది అదే రూటు

ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో జిల్లాలో ఆయా పార్టీల అభ్యర్థులు ప్రచారాన్ని ముమ్మరం చేశారు. నామినేషన్‌కు గడువు దగ్గర పడుతుండటంతో ఓటర్లను మచ్చిక చేసుకునేందుకు వ్యూహాలు రచిస్తున్నారు. కొందరు గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ ఓటు వేయాలని అభ్యర్థిస్తుండగా.. మరికొందరు గతంలో ఎప్పుడు లేనివిధంగా సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారు. కరపత్రాలు, బ్యానర్లు, ఫ్లెక్సీలను పక్కన పెట్టి సామాజిక మాధ్యమాలను ఆశ్రయిస్తున్నారు. జిల్లాలోని బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఏకంగా సోషల్ మీడియా కోఆర్డినేటర్లను నియమించుకుంటున్నారు. ఒక్కొక్క కోఆర్డినేటర్‌కు 10 నుంచి 20 మంది యువకులను అప్పగించి సోషల్ మీడియాలో ప్రచారం చేయిస్తున్నారు. ఒక్కో యువకుడికి నెలకు రూ. 20 వేల నుంచి రూ.25 వేల వరకు వేతనం ఇస్తూ జోరుగా ప్రచారం చేయిస్తున్నారు. ప్రస్తుత రోజుల్లో ప్రతీ ఒక్కరి చేతిలో స్మార్ట్‌ఫోన్ ఉండటంతో సోషల్ మీడియా ప్రచారానికి ఎక్కువ ఆసక్తి కనబర్చుతున్నారు.

వాట్సాప్ గ్రూపులు

ఎన్నికల ప్రచారంలో వాట్సాప్ యాప్‌ను విస్తృతంగా ఉపయోగిస్తున్నారు. నియోజకవర్గం, మండలం, గ్రామాలు, కుల సంఘాలు, యువజన సంఘాల పేరిట ప్రత్యేకంగా వాట్సాప్ గ్రూపులు ఏర్పాటు చేశారు. అందులో ప్రచార వివరాలు, మేనిఫెస్టో, గెలిస్తే చేసే అభివృద్ధి కార్యక్రమాల గురించి పోస్టులు పెడుతున్నారు. వీటి ద్వారా అతితక్కువ సమయంలో ఓటర్లకు దగ్గర కావాలని చూస్తున్నారు.

ప్రచార ఖర్చులు తక్కువే..

గతంలో ఎన్నికల వేళ ప్రచారం కోసం కరపత్రాలు, బ్యానర్లతో పాటు అభ్యర్థుల గుర్తులను సైతం ముద్రించి ఓటర్లకు పంచేవారు. కాగా అవి ఎన్నికల ఖర్చులోకి జమకట్టేవారు. కానీ ప్రస్తుతం అంతా సోషల్ మీడియా సభ్యులను ఎంపిక చేసుకుని వారి ద్వార ప్రచారం చేసుకుంటున్నారు. దీనికి అయ్యే ఖర్చులను ఎన్నికల సంఘానికి చూపించాల్సిన అవసరం లేదు. దీంతో సదరు అభ్యర్థుల ఖర్చు కూడా తగ్గుతుంది.

వీడియో వైరల్

ఇటీవల చిన్నశంకరంపేట మండలం ఎస్ కొండాపూర్‌కు గ్రామానికి చెందిన శ్రీశైలం యాదవ్ అనే వ్యక్తి వాట్సాప్ గ్రూప్‌లో మాట్లాడుతూ, ఉద్యమ సమయం నుంచి బీఆర్ఎస్‌లో ఉన్నానని, బస్సు దగ్ధం కేసు తనపై పోలీసులు మోపితే 3 నెలలు జైల్లో ఉన్నానని, తనకు పార్టీ నుండి ఎలాంటి అండదక్కలేదని ఏకంగా ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డిని విమర్శిస్తూ మాట్లాడిన వాయిస్ రికార్డు సోషల్‌మీడియాలో వైరల్ అయ్యింది.

సోషల్ మీడియాలో గొడవ..

మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి ముఖ్య అనుచరుడు సాప సాయిలు ఆమెకు సంబంధించిన మెసేజ్‌లను ఆయా గ్రూప్‌ల్లో పోస్టు చేస్తుంటాడు. కాగా, ఈ విషయంలో మైనంపల్లి హన్మంతరావు అనుచరుడు అశ్వినికి, సాయిలుకు మధ్య గత ఆగస్టులో గొడవ జరిగింది. దీనిపై వారు కొట్టుకునే వరకు వెళ్లారు. దీంతో సాయిలు ఎస్పీకి ఫిర్యాదు చేశారు. అనంతరం అశ్విని సైతం హైదరాబాద్‌లో పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోషల్ మీడియా వల్ల ప్రచారమే కాదు... ఇష్టానుసారం పోస్టులు పెట్టడం వల్ల ఇబ్బందికర పరిస్థితులు ఎదురయ్యే అవకాశం ఉంది. దీనిపై పోలీసులు గట్టి నిఘా పెట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ప్రభుత్వ పథకాలను గడపగడపకూ తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న గూడెం మహిపాల్ రెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ఒక కార్యకర్త వెయ్యి మంది ఓటర్లతో సమానమని పటాన్‌చెరు బీఆర్ఎస్ అభ్యర్థి గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలను గడపగడపకూ తీసుకెళ్లి పార్టీ గెలుపునకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రతిపక్ష పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలు అభివృద్ధిలో వెనుకబడ్డాయని తెలిపారు. నిత్యం అందుబాటులో ఉంటూ ప్రజా సంక్షేమానికి కృషి చేస్తున్న తనను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర శాసన మండలి మాజీ ఛైర్మన్ వెన్నవరం భూపాల్ రెడ్డి, కార్పొరేటర్లు పుష్ప నగేష్, వెన్నవరం సింధు, మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, అంజయ్య యాదవ్, పరమేష్, కుమార్ గౌడ్, గోవింద్, ఐలేష్ పాల్గొన్నారు.

డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే అభివృద్ధి

మద్దూరు(హుస్నాబాద్): డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని జనగామ బీజేపీ అభ్యర్థి ఆరుట్ల దశమంతరెడ్డి అన్నారు. శనివారం దూల్మిట్ట మండలం రెడ్యానాయక్‌తండా, దుబ్బతండా, కూటిగల్, కొండాపూర్, బెక్కల్, దూల్మిట్ట గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రతి సంక్షేమ పథకంలో కేంద్ర ప్రభుత్వం నిధుల వాటా ఉందన్నారు. ఎమ్మెల్సీగా గెలిచిన పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఎనిమిదేళ్ల నుంచి నియోజకవర్గానికి ఏం చేశారని ప్రశ్నించారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఉడుగుల రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి బూరుగు సురేష్‌గౌడ్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు డాక్టర్ బొంగొని సురేష్‌గౌడ్, శశిధర్‌రెడ్డి, చక్రధర్, ఉమారాణి, ధారావత్ బిక్షపతి నాయక్, లక్ష్మణ్‌నాయక్ పాల్గొన్నారు.



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న దశమంతరెడ్డి

స్థానికులకే ఉద్యోగ అవకాశాలు



సజ్జాపూర్ లో మాట్లాడుతున్న చంద్రశేఖర్

కోహీర్(జహీరాబాద్): ఎన్నికల్లో గెలిపిస్తే కర్మాగారాల్లో స్థానిక యువతకు ఉద్యోగావకాశాలు కల్పిస్తానని కాంగ్రెస్ అభ్యర్థి చంద్రశేఖర్ హామీ ఇచ్చారు. శనివారం ఆయన సజ్జాపూర్, ఖానాపూర్, కొత్తూరు(కె), పైదిగుమ్మల్, లాల్సింగ్ తండా, నాగిరెడ్డిపల్లి గ్రామాలలో ప్రచారం నిర్వహించారు. చక్కెర కర్మాగారం తెరిపించి రైతులకు ప్రయోజనం కలిగిస్తామని తెలిపారు. మాధవి, షాకిర్ అలీ, రామలింగారెడ్డి, రాచయ్య పాల్గొన్నారు.



వాహనాల తనిఖీల్లో నగదు పట్టివేత

నర్సాపూర్: పట్టణంలోని చెక్‌పోస్టు వద్ద శనివారం చేపట్టిన వాహనాల తనిఖీల్లో నగదు పట్టుబడినట్లు ఎస్ఐ శివకుమార్ తెలిపారు. సీపెల్లి ప్రవీన్ రూ.68,820, విల్సన్ రూ.1,05,310 నగదును ఎలాంటి పత్రాలు లేకుండా తీసుకెళ్తుండటంతో స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు.

సిద్దిపేటకమాన్: పట్టణంలోని బజాజ్ ఎలక్ట్రానిక్ షోరూం సమీపంలోని బ్రిడ్జి వద్ద శనివారం పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. గజ్వేల్ వడ్డెపల్లికి చెందిన గట్టు శివకుమార్ ఎలాంటి రశీదులు లేకుండా రూ.9లక్షల నగదును తీసుకెళ్తుండటంతో సీజ్ చేసినట్లు సిద్దిపేట వన్ టౌన్ సీఐ కృష్ణారెడ్డి తెలిపారు.

రామాయంపేట(మెదక్): రామాయంపేటలోని జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద పోలీసుల తనిఖీల్లో రూ.1,26,500 నగదు స్వాధీనం చేసుకున్నారు. కామారెడ్డి నుంచి హైదరాబాద్ వెళ్తున్న ఓ వ్యక్తి వద్ద రూ. 52,500, కామారెడ్డి నుంచి రాజమండ్రికి వెళ్తున్న హరినాథ్‌రెడ్డి వద్ద రూ.74 వేలు పట్టుబడినట్లు ఎస్ఐ రంజిత్ పేర్కొన్నారు.

ప్రవీణ్ పయనమెటో?




- కాంగ్రెస్ టికెట్ కేటాయింపులో రెండోసారి భంగపాటు
- భవిష్యత్ కార్యాచరణపై మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి సమావేశం
- కార్యకర్తల అభీష్టం మేరకు నిర్ణయం

హుస్నాబాద్: హుస్నాబాద్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి టికెట్ విషయంలో మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్ రెడ్డికి రెండోసారి భంగపాటు తప్పలేదు. ఆ టికెట్ మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్‌కు అధిష్ఠానం కేటాయించడంతో ప్రవీణ్‌రెడ్డి భవిష్యత్ కార్యచరణపై దృష్టి సారించారు. నియోజకవర్గంలోని భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లో ఆయన నివాసంలో శనివారం కార్యకర్తలతో చర్చించారు. దాదాపు 15 నెలల నుంచి కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేస్తూ, నెల రోజుల నుంచి కాంగ్రెస్ గ్యారంటీ పథకాలను ఇంటింటికీ చేరవేస్తూ టికెట్ నాకే వస్తుందనే ధీమాతో ప్రచారం నిర్వహించారు. 2018లో పొత్తులో భాగంగా హుస్నాబాద్ సీటును సీపీఐకి కేటాయించారు. ఆ సమయంలో కార్యకర్తలు ఇండిపెండెంట్‌గా పోటీ చేయాలని ఒత్తిడి తెచ్చినా అధిష్ఠానం నిర్ణయానికి కట్టుబడి పని చేశారు. ఆ ఎన్నికల్లో సీపీఐ అభ్యర్థి చాడ వెంకట్ రెడ్డి గెలుపుకోసం ప్రవీణ్ రెడ్డి కోసం కృషి చేశారు. అనంతరం జరిగిన పరిణామాలతో ప్రవీణ్ రెడ్డి బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. ఆ పార్టీలో తగిన ప్రాధాన్యం లభించడం లేదని తిరిగి కాంగ్రెస్‌లో చేరారు. దాదాపుగా 15 నెలల నుంచి పార్టీ బలోపేతం కోసం కృషి చేశారు. సుమారు 90 గ్రామాల్లో పర్యటించారు. టీ పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి హుస్నాబాద్‌లో పాదయాత్ర చేసినప్పుడు ఆ కార్యక్రమాన్ని ప్రవీణ్‌రెడ్డి సక్సెస్ చేశారు. హుస్నాబాద్‌లో మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ సడెన్ ఎంట్రీ ఇవ్వడంతో అప్పటి నుంచి ఇద్దరి మధ్య దూరం పెరిగింది. కాంగ్రెస్ టికెట్ తనకే వస్తుందని ఎవరికి వారే ధీమా వ్యక్తం చేస్తూ పార్టీ కార్యక్రమాలు నిర్వహించారు. పొన్నం ప్రభాకర్‌కు ఢిల్లీ పెద్దలు, ప్రవీణ్ రెడ్డి టీపీసీసీ పెద్దల అండదండలతో ఎవరికి వారు ప్రచారం నిర్వహించారు. తీరా శుక్రవారం హుస్నాబాద్ కాంగ్రెస్ టికెట్‌ను పొన్నం ప్రభాకర్‌కు కేటాయిస్తున్నట్లు ఏఐసీసీ ప్రకటించడంతో ప్రవీణ్‌రెడ్డికి నిరాశే ఎదురైంది. రెండు పర్యాయాలు ప్రవీణ్‌రెడ్డికి కాంగ్రెస్ మొండిచేయి చూపించింది. ఈ ఎన్నికల్లో ఇండిపెండెంట్‌గా లేదా ఏఐఎఫ్‌బీ (సింహం) నుంచి పోటీ చేస్తారా..? లేదంటే కాంగ్రెస్ అధిష్ఠానం పిలిచి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సముచిత స్థానం కల్పిస్తామని ఏమైనా హామీ ఇస్తారా అనేది తెలియాల్సి ఉంది. అదే విధంగా హుస్నాబాద్ టికెట్ పొందిన పొన్నం ప్రభాకర్ శనివారం ప్రవీణ్ రెడ్డి ఇంటికి వెళ్లి తనకు మద్దతు తెలిపాలని కోరగా, కార్యకర్తలతో చర్చించిన తర్వాత నిర్ణయం తీసుకుంటానని ప్రవీణ్ రెడ్డి సమాధానం చెప్పినట్లు కాంగ్రెస్ శ్రేణులు తెలిపారు.

కార్యకర్తల అభీష్టం మేరకు నిర్ణయం


మాజీ ఎమ్మెల్యే అల్గిరెడ్డి ప్రవీణ్ రెడ్డికి కాంగ్రెస్ టికెట్ కేటాయించకపోవడంతో శనివారం ముల్కనూర్‌లోని తన నివాసంలో భవిష్యత్ కార్యచరణ కై కార్యకర్తలతో చర్చించారు. అనంతరం ప్రవీణ్ రెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ 2018లో హుస్నాబాద్ సీటును సీపీఐకి కేటాయించినా పార్టీ నిర్ణయం మేరకు తాను సీటును త్యాగం చేశానన్నారు. తాను బీఆర్ఎస్‌లో చేరినప్పుడు మళ్లీ కాంగ్రెస్‌లోకి రావాలని, టికెట్ నీకే ఇస్తామని రాష్ట్ర పెద్దల హామీ మేరకు మళ్లీ కాంగ్రెస్‌లో చేరినట్లు చెప్పారు. కరీంనగర్ నుంచి వచ్చిన పొన్నం ప్రభాకర్ హుస్నాబాద్ సీటును ఆశిస్తున్నప్పటికీ టికెట్ తనకే ఇస్తామని, ప్రచారం చేసుకోమని చెబితే ఇంటింటికి తిరుగుతూ పార్టీ బలోపేతం కృషి చేశానన్నారు. 2009లో ఎమ్మెల్యేగా తాను ఇక్కడ చేసిన అభివృద్ధే కనపడుతుందని, కొత్తగా ఏం జరగలేని ప్రజలు విశ్వసిస్తున్నారని తెలిపారు. సర్వే రిపోర్టులో కూడా జిల్లా వ్యాప్తంగా హుస్నాబాద్‌లో కాంగ్రెస్ నెంబర్‌వన్‌గా ఉందని స్పష్టం చేసిందన్నారు. ఒక సారి హుస్నాబాద్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచానని, స్థానికంగా తాను ఉండి పార్టీ బలోపేతం కృషి చేశానని, కాంగ్రెస్ గెలిచే సీటును పొన్నంకు ఉలా కేటాయించారో కాంగ్రెస్ పెద్దలు సమాధానం చెప్పాలన్నారు. కార్యకర్తల అభీష్టం మేరకు నిర్ణయం తీసుకుంటామని.. రెండు, మూడు రోజుల్లో భవిష్యత్ కార్యచరణను ప్రకటిస్తానని ప్రవీణ్ రెడ్డి స్పష్టం చేశారు.



మాట్లాడుతున్న అల్గిరెడ్డి ప్రవీణ్ రెడ్డి

ఇక్కడ గెలిస్తే.. అక్కడ అధికారమే!

- గజ్వేల్ నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా గెలిచిన పార్టీకే రాష్ట్ర పీఠం
- 15 ఎన్నికల్లోనూ ఇదే ఆనవాయితీ
- కేసీఆర్ తాజా వ్యాఖ్యలతో సెంటిమెంట్‌కు మరింత ప్రాధాన్యం



గజ్వేల్: గజ్వేల్ నియోజకవర్గం నేడు రాష్ట్ర రాజకీయాలకు కేంద్ర బిందువుగా మారింది. ఇక్కడ గెలిచే పార్టీయే రాష్ట్రంలో అధికారంలోకి రావడం ఆనవాయితీగా మారింది. గత 16 ఎన్నికలకుగానూ 15ఎన్నికల్లో ఈ సెంటిమెంట్ నిజమైంది. ఈనెల 20న మేడ్చల్ జిల్లా అంతాయిపల్లిలోని ఎస్ఎస్ఆర్ కన్వెన్షన్‌లో నిర్వహించిన నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో స్వయంగా కేసీఆర్ ఈ అంశాన్ని ప్రస్తావించడంతో గజ్వేల్ సెంటిమెంట్‌కు మరింత ప్రాధాన్యత చేకూరింది. ఈ వ్యవహారంపై కథనం..

గజ్వేల్ నియోజకవర్గం ఎన్నో విశేషాలకు నెలవుగా మారింది. ప్రత్యేకించి 1952లో జరిగిన ఎన్నికల్లో తప్ప మిగతా 15సార్లు జరిగిన ఎన్నికల్లో ఏ పార్టీ ఎమ్మెల్యే గెలిస్తే ఆ పార్టీ రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటుచేయడం విశేషం. ఈ అంశాన్ని ఈనెల 20న మేడ్చల్ జిల్లా తూంకుంటలో గజ్వేల్ కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఈ అంశాన్ని సీఎం కేసీఆర్ ప్రత్యేకంగా ప్రస్తావించారు. 1957 ప్రాంతంలో గజ్వేల్ ద్విసభ్య నియోజకవర్గంగా ఉండగా.. ఆ సమయంలో కాంగ్రెస్‌కు చెందిన ఆర్.నర్సింహ్మారెడ్డి, జేబీ ముత్యాలరావులు గెలుపొందగా, ఆ పార్టీకి చెందిన ప్రభుత్వం రాష్ట్రంలో అధికారాన్ని చేపట్టింది. అదేవిధంగా 1958లో జరిగిన ఉప ఎన్నికల్లో కాంగ్రెస్‌కు చెందిన ఆర్.నర్సింహారెడ్డి గెలుపొందగా... ఆ పార్టీ అధికారంలోకి వచ్చింది. అదేవిధంగా 1962నుంచి 1978వరకు కూడా కాంగ్రెస్‌కు చెందిన గజ్వేల్ సైదయ్య నాలుగుసార్లు గెలుపొందగా ఆ పార్టీ ప్రభుత్వం రాష్ట్రంలో అధికారం చేపట్టింది. 1983, 1985, 1994, 1999లో నాలుగు సార్లు ఇక్కడ టీడీపీ ఎమ్మెల్యేలు గెలుపొందగా.. ఆ పార్టీ అధికార పగ్గాలను చేపట్టింది. 1989, 2004, 2009లలో కాంగ్రెస్‌కు చెందిన ఎమ్మెల్యేలు గెలుపొందగా.. ఆ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అదే విధంగా 2014, 2018లలో టీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఈ నియోజకవర్గం నుంచి పోటీ గెలుపొందగా... ఆ పార్టీ అధికార పీఠం దక్కించుకుంది.

స్థానికేతరులకు అడ్డాగా...

1952లో ఎమ్మెల్యేగా గెలిచిన పెండెం వాసుదేవ్, 1957లో ద్విసభ్య నియోజకవర్గంగా ఉన్న సమయంలో పనిచేసిన జేబీ. ముత్యాలరావు, ఆర్. నర్సింహారెడ్డి, 1983లో గెలుపొందిన అల్లం సాయిలు, 1985లో ఎమ్మెల్యేగా పనిచేసిన సంజీవరావు, 1989, 2004లలో పనిచేసిన డాక్టర్ జే.గీతారెడ్డి, 1994లో పనిచేసిన డాక్టర్ జి.విజయరామారావు, 1999లో పనిచేసిన సంజీవరావులు స్థానికేతరులే. స్థానిక నాయకత్వం బలంగా లేదనే కారణంతో గజ్వేల్‌లో కాంగ్రెస్, టీడీపీ రాజకీయాలను శాసించిన నేతలు ఇక్కడ స్థానికేతర నాయకులను 'బరి'లోకి దింపి గెలిపించారు.

తెలంగాణకు తొలి సీఎంను అందించిన నియోజకవర్గం

2014, 2018 ఎన్నికల్లో ఈ నియోజకవర్గాన్ని సెంటిమెంట్‌గా ఎంచుకున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అనుకున్న విధంగానే ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్ఠించారు. ఇక్కడే ఫామ్‌హౌస్ ఏర్పాటు చేసుకొని వ్యవసాయం చేసుకుంటున్న కేసీఆర్.. అప్పట్లో ఇదే తన 'ఇలాఖా'గా ప్రకటించారు. ప్రస్తుతం ఈ ప్రాంతాన్ని రాష్ట్రంలోనే అభివృద్ధికి నమూనాగా తీర్చిదిద్దారు.

ఎమ్మెల్యేలు, ప్రత్యర్థుల వివరాలు

సంవత్సరం	ఎమ్మెల్యే	ప్రత్యర్థి
1952	పెండెం వాసుదేవ్	ఎంహెచ్.రావు
1957	జేబీ.ముత్యాలరావు, ఆర్. నర్సింహ్మారెడ్డి	మల్లేశం, ఎ.మల్లేశం
1958 (ఉప ఎన్నిక)	ఆర్.నర్సింహ్మారెడ్డి	భూమాజీ
1962	గజ్వేల్ సైదయ్య	జి.వెంకటస్వామి
1967	గజ్వేల్ సైదయ్య	జీహెచ్.క్రిష్ణమూర్తి
1972	గజ్వేల్ సైదయ్య	అల్లం సాయిలు
1978	గజ్వేల్ సైదయ్య	అల్లం సాయిలు
1983	అల్లం సాయిలు	గజ్వేల్ సైదయ్య
1985	బీ.సంజీవరావు	గజ్వేల్ సైదయ్య
1989	డాక్టర్ జే.గీతారెడ్డి	సంజీవరావు
1994	విజయరామారావు	డాక్టర్ జే.గీతారెడ్డి
1999	సంజీవరావు	డాక్టర్ జే.గీతారెడ్డి
2004	డాక్టర్ జే.గీతారెడ్డి	నంది దుర్గయ్య
2009	తూంకుంట నర్సారెడ్డి	వంటేరు ప్రతాప్‌రెడ్డి
2014	కే. చంద్రశేఖర్‌రావు	వంటేరు ప్రతాప్‌రెడ్డి
2018	కే. చంద్రశేఖర్‌రావు	వంటేరు ప్రతాప్‌రెడ్డి

సాక్షి సండే క్లాసిఫైడ్స్

REAL ESTATE

FLAT FOR SALE

'0' Kms from SEZ Financial Dist, Gachibowli, Hyd. Luxury Gated Apartments, 2 / 3 / 4 BHK Flats for Sale. Near Google, Amazon etc., Ph : 9849025003. [HA-11785]

SERVICES

BUSINESS OFFER

ద్వారకా ఎంటర్‌ప్రైజెస్: పేపర్ ప్లేట్స్ & LED మెషిన్స్‌పై ప్రతి నెల అధిక ఆదాయం, అద్భుత అవకాశం, ఉచిత ముడి పదార్థాలు, 100% తిరిగి కొనుగోలు ఒప్పందం. Ph: 9310515624, 8800496710 [HA-41758]

Distribution Invitation Invest 1 Lakh and above Get up to 1 Lakh & above/Month Contact: for more info: 9010592111, 9948212111 [H-193260]

WANTED

మా ఆఫీసు న్యూ బ్రాంచ్ ద్వారా మీ ఖాళీ సమయంలో పార్ట్ టైమ్ / ఫుల్‌టైమ్ వర్క్ చేస్తూ 15వేలు ఆపైన సంపాదించే అవకాశం. 9177736926 [G-601029]

ఒక ప్రముఖ సర్వే సంస్థలో తెలంగాణ ఎలక్షన్ క్యాంపెయిన్ & సర్వే చేయుటకు రాజకీయ అవగాహన కలిగిన వెండార్స్ (500+టీం మెంబర్స్) కావలెను. ఫోన్ : 7396856819, 7386886819 [HA-1343]

రామకృష్ణ హోంకేర్ సర్వీస్: VJA, HYD శ్రీమంతుల ఇళ్లలో వృద్ధులసేవకు వంట/ఇంటిపని, బేబీకేర్ వర్కర్స్ కావలెను. జీ. 15-21 వేలు. ఏజెంట్లకు కమీషన్ 5 వేలు ✆ 6281208600, 6281208656 [B-1068136]

విజయవాడలో A/C & Coolers రెంటల్ (towerac.com) కంపెనీకి A/C టెక్నీషియన్స్-3, డ్రైవర్లు-3, హెల్పర్లు-5, 30సం.లోపు జీ:18 - 25,000 ట్రైనింగ్ / భోజనం / వసతి ఫ్రీ. ✆ 91771 77244 [B-1206681]

త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఉచిత వసతి + భోజనం. జీతం: 18K. Ph: 9848571888/ 9640400073 [H-189346]

పనివారు కావలెను. హైదరాబాద్, బెంగళూరులో ఉండి ఇంటిపని, వంటపని, వృద్ధుల సేవ, పిల్లల పోషణకు స్త్రీలు, కావలెను. సంప్ర॥ 9391912949, 040-40123376. [H-788378]

షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో లేడి వంట మనుషులు, వార్డ్ బాయ్స్, ఆయాలు, భార్యాభర్తలు, గార్డెన్ పని & ఆవులు చూసుకొనుటకు వాచ్‌మెన్ కావలెను. Ph: 9391036931, 9246585901 [HA-12454]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.